
ప్రజాశక్తి
శనివారం 1 నవంబర్ 2025 5
విజయనగరం



తత్కాల్ ఫీజు రద్దు

విద్యార్థులపై అదనపు భారం తొలగింపు : విసి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెఎన్‌టియు గురజాడ సాంకేతిక విశ్వవిద్యాలయం విద్యార్థులపై ఉన్న అదనపు ఆర్థిక భారం తొలగించాలనే లక్ష్యంతో తత్కాల్ ఫీజును రద్దు చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నూతన నిర్ణయం ఆంధ్ర రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నవంబర్ 1వ తేదీ నుండి అమల్లోకి రానుందని విశ్వవిద్యాలయ నూతన ఉపకులపతి ఆచార్య వివి సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. నేటి సాంకేతిక యుగంలో విశ్వవిద్యాలయ సేవలను మరింత పారదర్శకంగా, వేగవంతంగా విద్యార్థులకు చేరవేయడం ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. ఇంతవరకు ధ్రువీకరణ పత్రాలు పొందేందుకు విద్యార్థులు 'తత్కాల్ సేవ' కింద రూ.3వేలు అదనపు ఫీజు చెల్లించాల్సి వచ్చేదని, ఇకపై ఎటువంటి అదనపు రుసుములు లేకుండా, విద్యార్థులు అవసరమైన ధ్రువపత్రాలు 24 గంటల్లోపు ఆన్లైన్ ద్వారా పొందవచ్చని తెలిపారు.

అధిక వర్షాలతో..
దెబ్బతిన్న మొక్కజొన్న, పత్తి

- ఇప్పటికే తగ్గిన దిగుబడి
- అరటి, కందపైనా తీవ్ర ప్రభావం
- నష్టపోయామంటూ రైతుల ఆవేదన

గడిచిన నెల రోజులుగా కురుస్తున్న వర్షాలకు మొంథా తుపాను తోడవ్వడంతో మొక్కజొన్న, పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయారు. అరటి, కంద పంటలు కూడా దెబ్బతిన్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో ఎప్పటికప్పుడు కొనుగోలు చేసేందుకు ప్రయత్నించాల్సిన అధికార యంత్రాంగం ఇంకా మీనమేషాలు లెక్కిస్తోంది. అరటి, బొప్పాయి గత నెలలో వీచిన గాలులకు వందలాది ఎకరాల్లో నేలమట్టమయ్యాయి. తాజాగా వచ్చిన తుపాను గాలులకు చిగురుటాకుల్లా ఊగిపోయాయి. మూడు నెలలుగా వర్షాల ప్రభావం కంద, పసుపు పంటలపైనా ఉంటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి/సాలూరు

ఉమ్మడి విజయనగరం జిల్లాలో వరి తరువాత స్థాయిలో మొక్కజొన్న, పత్తి పంటలు సాగవుతున్నాయి. ఈఏడాది విజయనగరం జిల్లాలో 24,947 ఎకరాలు, మన్యం జిల్లాలో 15,029 ఎకరాలు చొప్పున మొత్తం ఉమ్మడి జిల్లాలో సుమారు 35వేల ఎకరాల మేర మొక్కజొన్న సాగైంది. సీజన్ ప్రారంభం నుంచీ వర్షాలు పడుతునే ఉన్న విషయం విధితమే. ముఖ్యంగా గత నెలలోనే మొక్కజొన్న గింజ కడుతున్న సమయంలో ఎడతెరిపిలేని వర్షాలు దిగుబడి తీవ్ర ప్రభావం చూపాయి. పది రోజులుగా కోతలు సాగుతున్నాయి. కోసినచోట గింజలను ఎండబెట్టేందుకు అవకాశం లేకుండా పోయింది. సాలూరు, మక్కువ, పాచిపెంట ప్రాంతాల్లో టార్పాణాలు అద్దెకు తీసుకుని రోడ్లపై ఎండబెట్టినప్పటికీ, వర్షాలు తెరుపు ఇవ్వకపోవడం వల్ల ప్రయోజనం లేకపోతోంది. ఇటు పూసపాటిరేగ, చీపురుపల్లి తదితర మండలాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది.



వర్షాలతో దెబ్బతిన్న పత్తి పంట

గతంలో ఎకరాకు 1600 కేజీల నుంచి 200కేజీలు దిగుబడి కాగా, వర్షాల కారణంగా 40నుంచి 50శాతం దిగుబడి తగ్గిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు తాజాగా మొంథా తుపాను వల్ల మూడు రోజులుగా మొక్కజొన్న కోతలు కూడా నిలిచిపోయాయి.

పత్తి విషయానికి వస్తే.... విజయనగరం జిల్లాలో 5,818 ఎకరాల్లోనూ, మన్యం జిల్లాలో 16,706 ఎకరాల్లోనూ సాగయ్యింది. ఇప్పటికే దాదాపు అన్ని ప్రాంతాల్లోనూ పత్తి ఏరివేత ప్రారంభమైంది. కానీ, కాయకట్టే దశనుంచీ రోజూ వర్షాలు కురవడం, పువ్వు వికసించే సమయంలోనూ వర్షాలు తెరుపు ఇవ్వకపోవడం వంటి పరిస్థితుల వల్ల దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది. తుపానుతో పత్తి పూర్తిగా దెబ్బతింది. నెలరోజుల క్రితమే పత్తి ఏరివేత ప్రారంభమైనప్పటికీ ఎండబెట్టేందుకు అవకాశం కుదరలేదు. గతంలో మార్చి నెలాఖరు వరకు సుమారు ఆరు నుంచి పది దఫాలు పత్తి ఏరేవారమని, ఈసారి రెండు కోతలతో ఇప్పటికే ఆఖరి అయ్యాయని సాలూరు మండలం తోణాం, మరుపల్లి, మామిడిపల్లి తదితర గ్రామాలకు చెందిన రైతులు ప్రజాశక్తి ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. కోచిన పత్తి కూడా నాణ్యత ప్రశ్నార్థకంగా ఉందంటూ మరికొంతమంది లబోదిబోమంటున్నారు. ముఖ్యంగా మన్యం జిల్లాలో సాలూరు, మక్కువ, పాచిపెంట, అటు కురుపాం, జియ్యమ్మవలస మండలాల్లో గత నెలరోజులుగా బీభత్సంగా వీచిన గాలులకు అరటిచెట్లు వందలాది ఎకరాల్లో నేలకొరిగాయి. నాటిన నుంచి భూమిలో ఉష్ణోగ్రతలు చాలా తక్కువగా ఉండడంతో ఈ ఏడాది దిగుబడి చాలా తక్కువగా ఉంటాయంటూ సాలూరు, మక్కువ ప్రాంతాల్లో సాగుచేస్తున్న కంద, పసుపు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పెట్టుబడి కూడా రాదు



ఈ ఏడాది మొక్కజొన్న సాగులో పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. ఎకరాకు రూ.30వేల చొప్పున మూడు ఎకరాలకు రూ.90వేల పెట్టుబడి అయ్యింది. కానీ, మొక్క మొలిసింది మొదలు ఇప్పటి వరకు వర్షాలు కురుస్తునే ఉన్నాయి. కీలకమైన దశలో కూడా వర్షాలు తగ్గుముఖం పట్టకపోవడంతో 50శాతం దిగుబడి తగ్గిపోయింది. పోని, వచ్చిన దిగుబడికైనా మద్దతు ధర వస్తుందంటే గింజలు ఎండబెట్టుకోవడానికి కూడా అవకాశం లేకుండా పోయింది. తేమ శాతం పేరుతో కొనుగోలుదారులు ఇంకెంత కోత పెడతారో...!

- పూజారి శ్రీనివాసరావు, మొక్కజొన్న రైతు, మామిడిపల్లి, సాలూరు మండలం

భోగాపురంలో భూములు మిగిలేనా?

- ప్రయివేట్ వ్యక్తులకు కేటాయించేందుకు సిద్ధపడుతున్న ప్రభుత్వం
- పోలిపల్లి రెవెన్యూ పరిధిలో 324 ఎకరాల పరిశీలన

ప్రజాశక్తి-భోగాపురం

భోగాపురం మండలంలో అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. దీనికితోడు మండలం మీదుగా చెన్నై నుంచి కోల్‌కత్తా జాతీయ రహదారి వెళ్లింది. విశాలమైన తీర ప్రాంతం మరోవైపు. విశాఖపట్నం మహానగరానికి భోగాపురం అతి సమీపంలో ఉంది. ఇవన్నీ పరిశ్రమల స్థాపనకు కలిసొచ్చే అంశంగా కనిపిస్తుంది. వివిధ రకాల పరిశ్రమలతోపాటు ఐటి కంపెనీలు, హోటళ్ల స్థాపనకు అనుకూల వాతావరణం ఉండడంతో ప్రముఖ కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయి. ఈ క్రమంలో ప్రముఖ టాటా ఐటి కంపెనీ యూనిట్ స్థాపనకు భూములు కావాలని ప్రభుత్వానికి ప్రతిపాదించింది. దానికి అనుగుణంగా, జిల్లా అధికారులు వివిధ గ్రామాల్లో 8 చోట్ల భూములను గుర్తించినట్లు సమాచారం. ఈ మేరకు శుక్రవారం జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్, ఆర్‌డిఒ దాట్ల కీర్తి, స్థానిక రెవెన్యూ అధికారులు కలిసి పోలిపల్లి రెవెన్యూ పరిధిలో ఉన్న 324 ఎకరాల భూములను టాటా కంపెనీకి చెందిన డిసి టీమ్‌తో కలిసి పరిశీలించారు. అమారం కూడలి సమీపంలో ఉన్న ఈ భూములు ఐటి పరిశ్రమ స్థాపనకు అనుకూలంగా ఉన్నాయని కంపెనీ ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. టోల్‌గేట్ సమీపంలోని భూములను కూడా పరిశీలించాలని అధికారులు కోరినప్పటికీ అమారం కూడలి వద్దనున్న భూములు అనుకూలంగా ఉండటంతో పోలిపల్లి రెవెన్యూ పరిధిలోని



భూముల మ్యాపును పరిశీలిస్తున్న జెసి సేతు మాధవన్

భూములపైనే మొగ్గు చూపారు. టాటా కంపెనీ ప్రభుత్వాన్ని 500 ఎకరాల భూములు కేటాయించాలని కోరినట్లు భోగట్టా. ప్రస్తుతానికి పోలిపల్లి పరిధిలో ఉన్న 324 ఎకరాల భూములను టాటా కంపెనీ అధికారులకు చూపించారు.

ఇదిలా ఉండగా 1967లోనే మాజీ సైనిక ఉద్యోగులకు ఈ భూములను కేటాయించారు. కొన్ని భూములు ఇప్పటికీ వారి ఆధీనంలోనే ఉండగా, మరికొన్ని ప్రయివేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లినట్లు సమాచారం. ఈ భూములను టాటా కంపెనీకి త్వరలో కేటాయించే అవకాశముంది. ఎయిర్‌పోర్ట్ భూసేకరణ తర్వాత, మండలంలో మరిన్ని పరిశ్రమలు స్థాపించడానికి ఆసక్తి చూపుతుండటంతో రెవెన్యూ అధికారులు కూడా పెద్దఎత్తున భూసేకరణకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. దీంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. తమకు భూములు మిగులుతాయో, లేదోనని ఆందోళన చెందుతున్నారు.

నెల్లిమర్ల ఎమ్మెల్యేకు చుక్కెదురు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవికి మండలంలోని కోనాడలో శుక్రవారం చేదు అనుభవం ఎదురైంది. తుపాను బాధితులతో పాటు మత్స్యకారులకు ప్రభుత్వం అందిస్తున్న నిత్యావసర సరుకుల పంపిణీ నిమిత్తం శుక్రవారం ఆమె మండలంలోని కోనాడ గ్రామానికి వెళ్లారు. కోనాడలో తుపాను బాధితులుగా 17 కుటుంబాలను రెవెన్యూ శాఖ గుర్తించగా, మత్స్యకార కుటుంబాలను 27 అర్హులుగా మత్స్య శాఖ నివేదిక తేల్చడంతో ఆ ప్రకారం వచ్చారు. గ్రామంలో సుమారుగా 600 మత్స్యకార కుటుంబాలు ఉంటే 27 కుటుంబాలకు మాత్రమే పంపిణీ ఎలా చేస్తారంటూ మత్స్యకార మహిళలు అడ్డుకున్నారు. ఎమ్మెల్యే స్పందించి ప్రభుత్వం గుర్తించిన మేరకే పంపిణీ చేయడానికి వచ్చానని, అందరికీ ఇవ్వలేమని చెప్పారు. దాంతో మత్స్యకార మహిళలు ఆగ్రహం వ్యక్తంచేశారు. గత తుపాను సమయంలో అందరికీ సహాయం అందేదన్నారు. అందరికీ పంచేందుకు అవకాశం లేదని చెప్పడంతో ఒక్కసారిగా మత్స్యకార మహిళ ఊగిపోయారు. 'మీకు ఓట్లు వేసి గెలిపించింది మేము. మీరు వైసిపి నాయకులు చెప్పిన వారికి పంపిణీ చేయడానికి వచ్చారా' అంటూ తీవ్ర వాగ్వివాదానికి దిగారు. పోలీసులు ఎంత వారించినా పరిస్థితి అదుపు తప్పుతుండటంతో ఎమ్మెల్యే అక్కడి నుంచి వెళ్లిపోయారు.



ఎమ్మెల్యేను నిలదీస్తున్న మత్స్యకార మహిళలు

ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ దంగా భూలోక మాట్లాడుతూ ఈ రాష్ట్రాంతంలో టిడిపికి ఓటు వేస్తున్నామంటూ ఎమ్మెల్యే నాగమాధవి అనడం విచారకరమన్నారు. తామంతా ఓటు వేసి గెలిపించిన సంగతి గుర్తుపెట్టుకోవాలని అన్నారు. ఈ విషయమై తమ పార్టీ పెద్దలతో చర్చిస్తామన్నారు. ఈ విషయమై టిడిపి మండల నాయకులు మత్స్యకారులతో కలిసి ఎంపిడిఒ రాధికతోపాటు కలెక్టర్‌ను శుక్రవారం కలిశారు. మత్స్యకారులందరికీ ప్రభుత్వం అందిస్తున్న సాయం అందించేలా చేయాలని కోరారు.

మత్స్యకారులందరికీ ప్రభుత్వం నుంచి నిత్యావసర సరుకులు మంజూరైనట్లు భోగాపురం సిఎస్ డిటి మురళి తెలిపారు. భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లో సుమారు 6800 కుటుంబాలకు మంజూరైనట్లు తెలిపారు. కోనాడ ఘటనపై ప్రభుత్వం స్పందించి అక్కడ 590 కుటుంబాలకు మంజూరు చేసినట్లు చెప్పారు.

స్కానింగ్ వివరాలు ఇవ్వాల్సిందే : డిఎంహెచ్ఒ

కంటోన్మెంట్:పిఎన్‌డిటి చట్టం ప్రకారం లింగ నిర్ధారణ నిషేధించారని,స్కానింగ్ వివరాలు తప్పనిసరిగా నమోదు చేసి కార్యాలనికి ఇవ్వాల్సిందేనని డిఎంహెచ్ఒ జీవన రాణి స్పష్టం చేసారు. శుక్రవారం డిఎంహెచ్ఒ కార్యాలయంలో పిసి అండ్ పిఎన్‌డిటి అమలుపై సలహా మండలి సమావేశం జరిగింది. జిల్లాలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉన్న 22 స్కానింగ్ సెంటర్లతో పాటు ప్రైవేట్ ఆధ్వర్యంలో మరో 102 సెంటర్లు పనిచేస్తున్నాయని, ఆయా కేంద్రాలు స్కానింగ్ వివరాలు అందించాలని, లింగ నిర్ధారణ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. స్కానింగ్ సెంటర్లు, ల్యాబ్‌లు మరియు రేడియాలజీ యూనిట్ల కార్యకలాపాలపై మానిటరింగ్, రికార్డ్ నిర్వహణ, రిజిస్టర్ నవీకరణ వంటి అంశాలపై సమీక్ష చేపట్టారు. సమావేశంలో జిల్లా సలహా కమిటీ సభ్యులు దీపక్ కుమార్, ప్రజారోగ్య నిపుణులు డాక్టర్ జి. సుధ, ఎన్‌జిఒ ప్రతినిధి జెకె దుర్గ, డిఐపిఆర్ఒ పి. గోవింద రాజులు, అదనపు డిఎంహెచ్ఒ డాక్టర్ కె.రాణి, ఉప డిఎంహెచ్ఒ డాక్టర్ సూర్యనారాయణ, డెమో వి చిన్నతల్లి, ఎస్ఒ గిరి గణేష్ పాల్గొన్నారు.

చెట్టు కిందే చదువులు

ప్రజాశక్తి- సంతకవిటి

ప్రభుత్వ విద్యకు పెద్దపీట వేస్తున్నామంటూ ప్రగల్భాలు పలికే పాలకుల మాటలకు, చేతలకు పొంతన లేదనడానికి ఇదో ఉదాహరణ. సంతకవిటి మండలం కాపుబూరాదపేట గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పరిస్థితి చూస్తే ఈ విషయం బోధపడుతుంది. పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. గోడలు చీలిపోయాయి. పైకప్పు జారిపోయింది. మొంథా తుపాను సమయంలో వర్షాలు విరుచుకుపడడంతో భవనం మరింత దెబ్బతింది. దీంతో ఉపాధ్యాయులు విద్యార్థులకు ఆరుబయటే చెట్ల కింద పాఠాలు చెబుతున్నారు. 21 మంది విద్యార్థులు చెట్ల నీడలోనే చదువుకోవాల్సి వస్తోంది.



ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో చెట్టు కింద చదువుకుంటున్న విద్యార్థులు

పంట నష్టాలను పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-విజయనగరంకోట

మొంథా తుపాను కారణంగా కొండకరకాం, గుంకలాం గ్రామాల్లో దెబ్బతిన్న వరి పంట పొలాలను శుక్రవారం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు పరిశీలించారు. రైతులతో మాట్లాడి జరిగిన పంట నష్టం గురించి అడిగి తెలుసుకున్నారు. ఎఒ శ్రీనివాసరావుతో మాట్లాడి, పంట నష్టంపై ఆరాతీశారు. అనంతరం నగరంలోని అశోక్ నగర్‌లో వర్షాలతో కూలిపోయిన 10 ఇళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో తూర్పుకాపు కార్పొరేషన్ చైర్ పర్సన్ పి.యశస్వి, తహశీల్దార్ కూర్మనాథరావు, ఆర్ఐ రాజు, తెలుగు మహిళా పార్లమెంట్ అధ్యక్షులు అనురాధ బేగం పాల్గొన్నారు.



దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అదితి

తగ్గుముఖం పట్టిన వరద

ప్రజాశక్తి-వంగర

మండలంలోని మడ్డువలస ప్రాజెక్టుకు వరద ఉధృతి శుక్రవారం నాటికి తగ్గుముఖం పట్టింది. మొంథా తుపాను నేపథ్యంలో సువర్ణముఖి, వేగావతి నదుల నుంచి వరద నీరు పోటెత్తడంతో ప్రాజెక్టు ఎనిమిది గేట్లు ఎత్తి 25 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసిన విషయం తెలిసిందే. వరద తగ్గుముఖం పట్టంతో శుక్రవారం ఐదు గేట్ల ద్వారా 10 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడిచి పెడుతున్నట్లు ప్రాజెక్టు ఎఇ కె. నితిన్ తెలిపారు.

దేశ సమైక్యతకు నిదర్శనం పటేల్

మంత్రి కొండపల్లి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక దేశ నిర్మాణానికి, సమైక్యతకు ఎంతోపాటుపడి ఎన్నో విషయాల్లో కఠినమైన నిర్ణయాలతో సమగ్రభారతా వనిని నిర్మించిన ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ రాష్ట్ర చిన్న, మద్య తరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. వల్లభాయ్ పటేలక్ష 150వ జయంతిని పురస్కరించుకుని ఆయన గొప్పతనాన్ని యువతకు, భవిష్యత్ తరాలకు తెలియజేయాలనే ఉద్దేశ్యంతో శుక్రవారం పోలీస్ ప్రాంగణం నుండి బాలాజీ కూడలి వరకు సమైక్యతా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పటేల్‌ను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ వల్లభాయ్ పటేల్ చేసిన త్యాగాలు వలన ఆయనకు సర్దార్ అనే బిరుదు ఇచ్చారని గుర్తు చేశారు. ఎమ్మెల్యే అదితి గజపతి రాజు మాట్లాడుతూ జమ్మూ కాశ్మీర్, హైదరాబాద్, జునాఘడ్ సంస్థానాలను తన రాజనీతితో చాకచక్యంగా భారతావని లో విలీనం చేసిన మహనీయుడని అన్నారు. ఈ సందర్భంగా పోలీస్ మైదానంలో ఏర్పాటు చేసిన సాంస్కతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం లో భాగంగా జిల్లా ఎస్పీ మాదక ద్రవ్యాలు, మత్తుపదార్థాలు వాడకం నిరోధించే నిమిత్తం యువత తో ప్రతిజ్ఞ చేయించారు. పోలీస్ శిక్షణా కళాశాల ప్రాంగణం లో ఉన్న సర్దార్ వల్లభాయ్ పటేల్ కాంస్య విగ్రహానికి పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం మంత్రి కొండపల్లి శ్రీనివాస్ జెండా ఊపి సమైక్యతా ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమం లో జిల్లా ఎస్పి ఎఆర్ దామోదర్, కూటమి నాయకులు రాజేష్ వర్మ, పాలవలస యశస్వి, మై భారత్ జిల్లా యువజన సమన్వయ కర్త ప్రేమ్ భరత్ కుమార్ పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న మంత్రి కొండపల్లి, ఎమ్‌పి, ఎమ్మెల్యే, తదితరులు

పని తక్కువ.. ప్రచారం ఎక్కువ

వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు ఎద్దేవా

ప్రజాశక్తి-కంటోన్మెంట్

కూటమి ప్రభుత్వానిది పని తక్కువ, ప్రచారం ఎక్కువని వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు ఎద్దేవా చేశారు. శుక్రవారం ధర్మపురిలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒకవైపున ప్రభుత్వ పెద్దలంతా టెక్నాలజీని ఉపయోగించి తుపానును ఎదుర్కొన్నామని గొప్పలు చెప్పుకుంటున్నారని తెలిపారు. వాస్తవ పరిస్థితులు చూస్తే ఎంత మేర పంట నష్టం జరిగిందనే వివరాలను అధికారులను అడిగితే.. ఇంకా అంచనా వేయలేదని చెబుతున్నారని ధ్వజమెత్తారు. జిల్లాలో వరి, మొక్కజొన్న, పత్తి, అరటి, బొప్పాయి, కూరగాయల పంటలన్నీ తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. దీనిపై ప్రభుత్వ యంత్రాంగం సత్వరమే స్పందించి, క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని పూర్తిగా అంచనా వేయాలని కోరారు. పంటల బీమాను ప్రభుత్వం చెల్లించకపోవడంతో రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ వచ్చే పరిస్థితి లేదని చెప్పారు. ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా నియోజకవర్గ కేంద్రాల్లో అక్టోబర్ 28న చేపట్టాల్సిన ర్యాలీలను తుపాను కారణంగా ఈ నెల 11కు వాయిదా వేశామన్నారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శులు కెవివి సూర్యనారా యణ రాజు, నెక్కల నాయుడుబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహమూర్తి, ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు జైహింద్ కుమార్ పాల్గొన్నారు.

719 ఎకరాల్లో నీటమునిగిన పంట

ప్రజాశక్తి-కొత్తవలస

శృంగవరపుకోట నియోజకవర్గంలో తుపాను ప్రభావంతో 718.95 ఎకరాల్లో పంటలు నీట మునిగినట్లు వ్యవసాయ శాఖ అధికారులు తేల్చారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారిని కలిసి నివేదికను అందించారు. జామి మండలంలో 412 ఎకరాలు, కొత్తవలసలో 90.2 ఎకరాలు, లక్కవరపుకోటలో 66.25 ఎకరాలు, శృంగవరపుకోటలో 70.5 ఎకరాలు, వేపాడ మండలంలో 80 ఎకరాల్లో పంట నీట మునిగినట్లు వివరించారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ చొక్కాకుల మల్లునాయుడు, వ్యవసాయ శాఖాధికారులు పాల్గొన్నారు.

గోడ కూలి మహిళ మృతి

ప్రజాశక్తి-కంటోన్మెంట్, కోట

నగరంలోని 38వ డివిజన్ గోకపేటలో ఇటీవల వర్షాలకు పడిపోయిన ఇంటి గోడ శుక్రవారం కూలిపోవడంతో రెయ్యి సన్యాసమ్మ (74) మరణించింది. విషయం తెలుసుకుని ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు అక్కడికి చేరుకొని పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు. ఎమ్మెల్యే వెంట టిడిపి పట్టణ అధ్యక్షులు గంటా రవి, కార్యదర్శి కోదండరాం, మండల అధ్యక్షులు గంటా పోలి నాయుడు, కార్యదర్శి పాశి అప్పలనాయుడు, రాష్ట్ర యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, నియోజకవర్గ నాయకులు ఉన్నారు.

కొవ్వొత్తులతో పోలీసుల ర్యాలీ

ప్రజాశక్తి-కంటోన్మెంట్

పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా నగరంలో పోలీసు శాఖ ఆధ్వర్యాన శుక్రవారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ చేపట్టారు. మూడు లాంతర్లు జంక్షన్ నుండి కోట జంక్షన్ వరకు ఈ ర్యాలీ సాగింది. ఈ ర్యాలీని ఎస్పి ఎఆర్ దామోదర్ ప్రారంభించారు. పోలీసు అమరవీరుల చిత్ర పటాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించి, అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను ముగించారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ అదనపు ఎస్పి జి.నాగేశ్వరరావు, డిఎస్పిలు ఆర్.గోవిందరావు, కోటిరెడ్డి, సిఐలు ఎ.వి.లీలారావు, ఆర్.వి.ఆర్.కె.చౌదరి, టి.శ్రీనివాసరావు, బి.లక్ష్మణరావు, సూరినాయుడు, ఈ.నర్సింహమూర్తి, ఆర్ఐలు, ఆర్.రమేష్ కుమార్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎండిఎం కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న ఎండిఎం కార్మికులు, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-తెర్లాం

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని స్థానిక ఎంఇఒ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా చేపట్టారు. అనంతరం ఎంఇఒ కార్యాలయంలో వినతి అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.శంకర్రావు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు, బకాయి మెస్ బిల్లులు చెల్లించాలన్నారు. ఎండిఎం కార్మికులకు కనీస వేతనం చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్.గోపాలం, మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం నాయకులు ఎ.సత్యవతి, కె.చూడామణి, ఎన్.రాములమ్మ, స్కూలు ఆయాల సంఘం నాయకులు రాము, కార్మికులు పాల్గొన్నారు.

ఆదిత్య విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ఆందోళన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కార్పొరేట్ ఆదిత్య విద్యాసంస్థల ఆగడాలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఆ కళాశాల ముందు శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వి.చినబాబు మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రుల రక్తాన్ని జలగల్లా పీల్చడమే కార్పొరేట్ ఆదిత్య కళాశాల లక్ష్యమన్నారు. నిర్మాణంలో ఉన్న భవనంలో ఆదిత్య ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో తరగతులు నిర్వహించడం విద్యార్థుల భద్రతను ప్రమాదంలో నెట్టడమేనని విమర్శించారు. డిగ్రీ, జూనియర్ కళాశాలలకు ఆదిత్య పేరుతో అనుమతి తీసుకొని కాకినాడ ఆదిత్య అని పెట్టడం అంటే విజయనగరం జిల్లా, ఉత్తరాంధ్రను తక్కువ చేసి చూపడమేనని అభిప్రాయ పడ్డారు. తక్షణమే అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన కాకినాడ ఆదిత్య బోర్డులను తొలగించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జె.రవి కుమార్, శిరీష, ఎస్.సోమేష్, వంశి, రాజు, నాయకులు సూరిబాబు, జయ, గుణ, రమణ పాల్గొన్నారు.



కళాశాల ఎదుట ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు



జిల్లా మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎపి రైతుసంఘం నాయకులు

9న ఎపి రైతుసంఘం జిల్లా మహాసభ

ప్రజాశక్తి-శృంగవరపుకోట.

ఈ నెల 9న శృంగవరపుకోటలో నిర్వహించే ఎపి రైతు సంఘం 9వ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు కోరారు. శుక్రవారం పట్టణంలోని సుబ్బిరామిరెడ్డి కళ్యాణ మండపంలో జిల్లా మహాసభ వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎపి రైతుసంఘం జిల్లా నాయకులు లోకవరపు ఆదినారాయణ మూర్తి, మద్దిల రమణ, కొంప రామకృష్ణమూర్తి, గేదెల శ్రీనివాసరావు, యర్రాప్రగడ భాస్కర్, కోడెల శ్రీను, కె.సురేష్, వై.జోగినాయుడు పాల్గొన్నారు.

వంద పడకలకు సిహెచ్‌సి..

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి సిహెచ్‌సిని వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసేందుకు ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో తీర్మానించారు. సిహెచ్‌సిలో శుక్రవారం అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఎమ్మెల్యే బేబినాయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి వస్తున్న రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని కోరారు. ఆసుపత్రికి వస్తున్న రోగులు, అందుతున్న వైద్య సేవలను సూపరింటెండెంట్ శశిభూషణరావును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బేబినాయన

కెజిబివిలకు ప్రాధాన్యత ఇవ్వాలి

యుటిఎఫ్ సీనియర్ నాయకులు కె.విజయగౌరి

ప్రజాశక్తి-గుర్ల

కెజిబివిల్లో మౌలిక వసతులు కల్పించేందుకు మరింత ప్రాధాన్యత ఇవ్వాలని యుటిఎఫ్ సీనియర్ నాయకులు కె.విజయగౌరి, జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. గుర్ల కెజిబివిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల అస్వస్థతకు గురైన విద్యార్థినులను శుక్రవారం వారు పరామర్శించారు. పిల్లల ఆరోగ్య పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విజయగౌరి మాట్లాడుతూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లు ఎక్కువగా సంభవిస్తున్నాయని, వాటిని నివారించే ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికార యంత్రాంగాన్ని కోరారు. ఎఎన్ఎంలు లేని చోట వెంటనే నియమించాలన్నారు. అన్ని కెజిబివిలకు వార్డెన్లను, కంప్యూటర్ ఆపరేటర్లను నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. కెజిబివి బోధన సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని, మినిమం టైమ్‌స్కేల్ అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు కె.విజయగౌరి

కెజిబివి సందర్శన

గుర్ల కెజిబివిని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. విద్యుదాఘాతానికి గురైన గదిని పరిశీలించారు. ఏ విధంగా షార్ట్ సర్క్యూట్ జరిగిందో దానికి సంబంధించిన నివేదికను ఆయన కోరారు. విద్యుత్తు పరికరాలు, వైర్ల నిర్వహణ ఎందుకు పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. 260 మంది బాలికలు చదువుతుండగా విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని, జాగ్రత్తగా చూసుకోవాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దారు పి.ఆదిలక్ష్మి, విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ నారమనాయుడు, కెజిబివి ప్రిన్సిపల్ జానకి పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌పి దామోదర్

ప్రజలకు పోలీసు సేవలు మరింత చేరువ

ప్రజాశక్తి -కంటోన్మెంట్

విజయనగరం 2వ పట్టణ ప్రజలకు పోలీసు సేవలను మరింత చేరువ చేసేందుకు ప్రత్యేకంగా రూపొందించిన 'సాథీ' సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ పోస్టరును ఎస్‌పి ఎ.ఆర్.దామోదర్ జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ 2వ పట్టణ పోలీసు స్టేషను పరిధిలో నివసిస్తున్న ప్రజలకు పోలీసు సేవలను మరింత చేరువ చేసే ఉద్దేశ్యంతో ప్రత్యేకంగా రూపొందించిన 'సాథీ' వెబ్సైట్, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ను ఆవిష్కరించామన్నారు. 'సాథీ' ఇన్స్టాగ్రామ్, ఫేస్ బుక్, ట్విట్టర్, యూట్యూబ్, వాట్సాప్ సోషల్ మీడియా అకౌంట్స్ ప్రారంభించామన్నారు. 2వ పట్టణ పోలీసులు చేపట్టే అవగాహన కార్యక్రమాలు, సలహాలు, సూచనలు, హెచ్చరికలు, చట్టాల వలన కలిగే ప్రయోజనాలు ప్రజలు సులువుగా తెలుసుకోవచ్చని తెలిపారు. ఇటువంటి వినూత్నమైన కార్యక్రమం చేపట్టిన విజయనగరం 2వ పట్టణ సిఐ టి.శ్రీనివాసరావును ఎస్‌పి ప్రత్యేకంగా అభినందించారు. ఇదే తరహాలో జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్లను త్వరలో సోషల్ మీడియా ప్లాట్ఫామ్స్‌ను ప్రారంభించాలని తెలిపారు. కార్యక్రమంలో విజయనగరం 2వ పట్టణ సిఐ టి.శ్రీనివాసరావు, ఎస్‌బి సిఐ ఎ.వి.లీలారావు, మహిళా పోలీసు స్టేషన్ సిఐ ఇ.నరసింహమూర్తి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

జిల్లా సహకార అధికారి రమేష్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లాలోని 65 సొసైటీల పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, డేటా సిద్ధంగా ఉంచాలని జిల్లా సహకార అధికారి బి.రమేష్ కోరారు. శుక్రవారం తన చాంబర్లో అసిస్టెంట్ రిజిస్ట్రార్లు, సీనియర్ ఇన్‌స్పెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 4న జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యాన ధాన్యం సేకరణపై సమావేశం ఉంటుందని తెలిపారు. సొసైటీల పరిధిలో పూర్తి వివరాలతో సమావేశానికి రావాలని కోరారు. ప్రతి నెలా మూడో శనివారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో నిర్వహించి కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-బాడంగి

తుపానుతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి గోపాలం డిమాండ్ చేశారు. మండలంలోని రేజేరు రెవెన్యూ పరిధిలో వర్షాలతో నీటమునిగిన పంటలను సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.శంకరరావుతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతవరకు వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు దెబ్బతిన్న వరిచేను పరిశీలించలేదన్నారు. ఏ పంట నష్టపోయినా ఆదుకుంటామనే ప్రచారమే తప్ప క్షేత్రస్థాయి నష్టాన్ని అంచనా వేయడం లేదని చెప్పారు. వెంటనే పంట నష్టాన్ని వెంటనే అంచనా వేసి రైతుకు న్యాయం చేయాలని కోరారు.

నిర్వాసితులను మోసగించిన జిందాల్ : సిపిఎం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

కంపెనీ కట్టకుండా ఉద్యోగాల పేరుతో మోసం చేసి ఘనత జిందాల్ యాజమాన్యానికే దక్కుతుందని సిపిఎం నాయకులు చల్లా జగన్ ఆక్షేపించారు. జిందాల్ పరిశ్రమ సేకరించిన భూములను తిరిగి తమకు అప్పగించాలని నిర్వాసితులు చేపడుతున్న నిరసన శుక్రవారం కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్వాసిత యువత ప్రశ్నిస్తారనే భయంతో జిందాల్ యాజమాన్యం మభ్యపెట్టే చర్యలకు పాల్పడుతోందని దుయ్యబట్టారు. కట్టని కంపెనీ కోసం శిక్షణ పేరుతో ఇతర రాష్ట్రాలకు పంపించి, అరకొరగా డబ్బులు ఇచ్చి, ప్రశ్నించకుండా ఉండేందుకు కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. ముందు నుంచీ జిందాల్ యాజమాన్యం నిరుపేదల నుంచి భూమి కొట్టేసేందుకే ఇన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నిందని మండిపడ్డారు. జిందాల్ యాజమాన్యంపై ప్రభుత్వం చర్యలు తీసుకుని, నిర్వాసితులకు భూమిని తిరిగి అప్పగించాలని డిమాండ్ చేశారు.

గిరిజనులను పట్టించుకోని ప్రభుత్వం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

గిరిశిఖర గ్రామాల గిరిజనులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని డిసిసి ఉపాధ్యక్షులు జి.బంగారునాయుడు ఆగ్రహం వ్యక్తంచేశారు. మండలంలోని గిరిశిఖర గ్రామమైన గుడిలోవలో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు పర్యటించారు. కొండపై గిరిజనుల కష్టాలను, ఆకలి బాధలను చూసి ఆయన వారికి బియ్యం, పప్పులు, కూరగాయలు వంటి నిత్యావసర సరుకులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తుపాను కారణంగా వరి, చోడి పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు ఇంటి మట్టి గోడలు నాని పెచ్చులూడాయని చెప్పారు. తుపాను నాలుగు రోజులు అన్ని తడిసిన కారణంగా తినేందుకు తిండి, తాగేందుకు మంచినీరు కూడా దొరక్క ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు గిరిజనుల గురించి కనీసం ఆలోచన చేయడం లేదని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో నానాజీ, అచ్చిబాబు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎఐతో గణనీయమైన మార్పులు

ప్రజాశక్తి-డెంకాడ

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ)తో భవిష్యత్తులో గణనీయమైన మార్పులు వస్తాయని జెఎన్‌టియు జివి వైస్ చాన్సలర్ వి.వి.సుబ్బారావు తెలిపారు. లెండి ఇంజినీరింగ్ కళాశాలలో మూడు రోజులపాటు నిర్వహిస్తున్న అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌లో శుక్రవారం ఆయన పాల్గొని మాట్లాడారు. సమాజంలో టెక్నాలజీ పాత్ర శ్లాఘనీయమని, అనేక మార్పులకు శ్రీకారం చుడుతుందని చెప్పారు. ప్రిన్సిపల్ వివి రామారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ తమ్మినేని హరిబాబు, వి.అంజిరెడ్డి, డీన్లు జి.ప్రకాశ్‌బాబు, ఆచార్యులు, కెవై వసంత్, విభాగాధిపతులు సుబ్బరామయ్య, సతీష్, రామారావు, రాజేంద్ర, నరేష్, ప్రసాద్, వర్మ, శైలజ పాల్గొన్నారు.

ఎంవిజిఆర్‌లో ముగిసిన సెమినార్

ప్రజాశక్తి-డెంకాడ

ఎంవిజిఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో మాన్యుఫ్యాక్చరింగ్ ఇండస్ట్రీస్‌లో కృత్రిమ మేధస్సు పాత్ర అనే అంశంపై ఐదు రోజులపాటు నిర్వహించిన ఆన్‌లైన్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా యుఎస్‌ఎలోని కెన్‌వ్యూలో స్టాఫ్ ఇంజినీర్ పి.సునీల్‌కుమార్ మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రాధాన్యతను వివరించారు. ఎంజివిఆర్ ప్రిన్సిపల్ వైఎంసి శేఖర్, ఎఫ్‌డిపి కోఆర్డినేటర్ బి.శ్రీనివాస్, రవికుమార్, పి.శ్రీనివాసరావు, జి.రాజేష్, జి.ప్రసాదకుమార్, సంతోష్‌కుమార్, గోవింద పాల్గొన్నారు.

'తిరుమల' ఆధ్వర్యంలో ఉచిత వైద్య సేవలు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

తిరుమల మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం వరల్డ్ బ్రెయిన్‌స్ట్రోక్ డే సందర్భంగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. సుమారు 70 మందికి న్యూరో డాక్టర్ రెడ్డి సుధీర్ నాయుడు ఉచిత వైద్య సేవలను అందించారు. అందరికీ బిపి, షుగర్, ఇసిజి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధీర్ మాట్లాడుతూ రాత్రిళ్లు సరిగా నిద్ర పట్టక పోయినా, మూతి వంకరలా అనిపించడం, చేయి పట్టు తప్పడం, నరాల బలహీన పడడం వంటి సమస్యలుంటే వైద్యులను సంప్రదించాలని చెప్పారు. సిటీ బ్రెయిన్, ఎంఆర్ బ్రెయిన్ స్కాన్ చేయించుకుంటే 50 శాతం వరకు రాయితీ ఇవ్వనున్నట్లు తెలిపారు.

కరకవలసలో నీటి పరీక్షలు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని కరకవలస గ్రామంలో 8 రకాల నీటి పరీక్షలు చేసినట్లు ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ దేవి తెలిపారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కాచిన టినే తాగాలని కోరారు. కార్యక్రమంలో స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ జి.రాంబాబు, వర్క్ఇన్స్పెక్టర్ కామేష్, పంచాయతీ కార్యదర్శి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

జాతీయ మహాసభను జయప్రదం చేయండి

సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.సురేష్



సిఐటియు జాతీయ మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షులు కె.సురేష్, అంగన్వాడీలు

ప్రజాశక్తి - సంతకవిటి

విశాఖపట్నంలో డిసెంబర్ 31 నుండి జనవరి 4 వరకు జరిగే సిఐటియు జాతీయ మహాసభను విజయవంతం చేయాలని ఆ యూనియన్‌జిల్లా అధ్యక్షులు కె.సురేష్, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి సిహెచ్ రూపవతి పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని గుళ్ల సీతారాంపురంలో మహాసభ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఐటియు చారిత్రాత్మక రైల్వే పోరాటం నుంచి నేటికీ కొనసాగుతున్న విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ వ్యతిరేక పోరాటం వరకూ అన్ని ఉద్యమాల్లోనూ అగ్రభాగాన నిలిచిందన్నారు. అలాంటి సిఐటియు జాతీయ మహాసభ తొలిసారిగా విశాఖలో జరగనుందని, ఈ సందర్భంగా జనవరి 4న మహాప్రదర్శన, బహిరంగ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. మహాసభ జయప్రదానికి కార్మికులు పెద్ద ఎత్తున కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు వై.సుశీల, రాంబాయి, శ్యామల, కాంత, రామ, తదితరులు పాల్గొన్నారు.

రాజాం : సిఐటియు జాతీయ మహాసభను విజయవంతం చేయాలని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.సురేష్ కోరారు. మండలంలోని బొద్దాంలో అంగన్వాడీ వర్కర్లతో కలిసి శుక్రవారం సిఐటియు మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు వి.పార్వతి, పి.ఈశ్వరమ్మ, బి.వెంకటలక్ష్మి, పి.సునీతకుమారి, సిహెచ్.మంగమ్మ, వి.నీలవేణి, బి.గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాడంగి : సిఐటియు జాతీయ మహాసభను విజయవంతం చేయాలని ఆ యూనియన్ మండల కన్వీనర్ ఎ.సురేష్ కోరారు. బాడంగిలో సిఐటియు జాతీయ మహాసభ పోస్టర్‌ను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ


వేపాడ.. నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

ప్రజాశక్తి-వేపాడ

తుపాను బాధితులకు నిత్యావసర సరుకులను స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సిఎం చంద్రబాబు నిరంతరం అధికారులను అప్రమత్తం చేయడం వల్ల ప్రాణనష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారని చెప్పారు. టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు మాట్లాడుతూ గ్రామాల్లో బాధితులను గుర్తించే సమయంలో కూటమి నాయకులతో సంప్రదించలేదని తహశీల్దార్ జె.రాములమ్మపై అసంతృప్తి వ్యక్తంచేశారు. ఇళ్లు కోల్పోయిన వారికి గృహాలు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జె.రాములమ్మ. ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ, డిటి రామకృష్ణ, తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షులు గుమ్మడి భారతి, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కొట్యాడ రమణమూర్తి,ఉపాధ్యక్షులు పోతల రమణ, ఐటిడిపి మండల అధ్యక్షుడు సేనాపతి గణేష్, మాజీ ఎంపిపి దాసరి లక్ష్మి, పార్టీ నాయకులు సిరికి రమణ, జనపురెడ్డి ఈశ్వర్ రావు పాల్గొన్నారు.

కొత్తవలస : లక్కవరపుకోట గ్రామంలో 49 మంది తుపాను ప్రభావిత కుటుంబాలకు స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి నగదు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ చొక్కాకుల మల్లు నాయుడు, మాజీ జెడ్‌పిటిసి కరెడ్ల ఈశ్వరరావు, ఎఎంసి డైరెక్టర్ పుట్టా శ్రీను, తహశీల్దార్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సంతకవిటి : కాకరపల్లి గ్రామంలో ఆర్థికంగా వెనుకబడిన చేనేత కుటుంబాలకు నిత్యావసర సరుకులను తహశీల్దార్ బి.సుదర్శన్‌రావు, తూర్పుకాపు మాజీ చైర్మన్ కొల్ల అప్పలనాయుడు, నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు వల్లూరు గణేష్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిఎస్ డిటి అనంతరావు, పిఎసిఎస్ చైర్మన్ సిహెచ్ మహేష్ కుమార్, టిడిపి మండల అధ్యక్షులు గట్టి భాను పాల్గొన్నారు.

యువత స్వయం ఉపాధితో ఎదగాలి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

యువత స్వయం ఉపాధితో మరికొంత మందికి దారి చూపించాలని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి అన్నారు. శుక్రవారం పట్టణంలోని వేణుగోపాలపురం కాలనీలో సారిపల్లి జగదీశ్వరి, శంకరరావు ఏర్పాటు చేసిన తులసి వాటర్ ప్లాంట్‌ని ఎమ్మెల్యే మాధవి ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు అవనాపు విక్రమ్, చైర్‌పర్సన్ బంగారు సరోజిని, కౌన్సిలర్ జనా సంధ్యారాణి, నాయకులు చనమల్లు వెంకటరమణ, యడ్ల గోవిందరావు, రవ్వా నాని, అంబళ్ల అప్పలనాయుడు, కరుమజ్జి గోవిందరావు, ఎంఎం నాయుడు తదితరులు పాల్గొన్నారు.


వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి

పలు సమస్యలపై చర్చ

ప్రజాశక్తి -బొబ్బిలి

మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం చైర్మన్ శరత్‌బాబు అధ్యక్షతన నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో పలు సమస్యలపై చర్చించారు. మాజీ సైనికుల ఇళ్ల స్థలాలకు భూమి కేటాయింపునకు ఎన్‌ఒసి ఇవ్వాలని కౌన్సిల్ అమోదానికి పెట్టగా, ఆ లేఅవుట్ అభివృద్ధి మున్సిపల్ నిధులతో చేయడం కష్టం అవుతుందని, ప్రత్యేక నిధులను కలెక్టర్‌ను అడగాలని వైసిపి కౌన్సిలర్ చోడిగంజి రమేష్‌నాయుడు కోరారు. శానిటరీ మేస్త్రీలు ఒకరికి బదులు మరొకరు చేస్తున్నారని, ఆలా చేయకుండా చూడాలని వైస్ చైర్మన్ చెలికాని మురళి కోరారు. పారిశుధ్యం, తాగునీరు, పన్నులపై చర్చ జరిగింది. సమావేశంలో కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

పంటనష్టం పరిశీలన

ప్రజాశక్తి-వేపాడ

ఇటీవల వర్షాలతో మండలంలో దెబ్బతిన్న పంటలను శుక్రవారం వ్యవసాయ శాఖ జిల్లా ప్రధాన శాస్త్రవేత్త కె.తేజేశ్వరరావు పరిశీలించారు. వెంటనే పొలాల్లో నీరు తీసేయాలని రైతులకు ఆయన సూచించారు. వరిచేను నిలబెట్టి, దుబ్బులుగా కట్టాలని చెప్పారు. ఈ సందర్భంగా పలు సూచనలు రైతులకు చేశారు. కార్యక్రమంలో ఎఒ స్వాతి కుమారి, విఎఎ తేజ పాల్గొన్నారు.

సబ్‌జైల్ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-చీపురుపల్లి

జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఇ.కృష్ణ ప్రసాద్ చీపురుపల్లి సబ్ జైలును శుక్రవారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. కారాగారంలో ఉన్న ఖైదీలకు న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ఖైదీల పట్ల సిబ్బంది గాని, తోటి ఖైదీలు గాని ఎటువంటి వివక్షత చూపించరాదని సుప్రీంకోర్టు ఇచ్చిన జడ్జిమెంట్ గురించి వివరించారు. సబ్ జైల్లో కొనసాగుతున్న జైల్ లీగల్ ఎయిడ్ క్లినిక్ లను తనిఖీ చేశారు. ఖైదీలను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నేర ప్రవృత్తిని విడనాడాలని చెప్పారు. కార్యక్రమంలో సబ్‌జైలు సూపర్‌ఇంటెండెంట్ పాల్గొన్నారు.

పునరావాస కేంద్రంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-మెరకముడిదాం

మండలంలో ఉత్తరావల్లిలో పునరావాస కేంద్రంలో మెరకముడిదాం పిహెచ్‌సి వైద్యాధికారి అజిత్‌బాబు ఆధ్వర్యాన శుక్రవారం వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. అనంతరం గ్రామంలో ఇంటింటి సర్వే చేపట్టారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి-నెల్లిమర్ల

స్థానిక సికెఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ ఎం.సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ కె.వెంకటేశ్వరరావు, లీడ్ బ్యాంకు రిటైర్డ్ మేనేజర్ రమణమూర్తి, లీడ్ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ ప్రత్యూష విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రతినిధులు ఎల్. సంధ్య, ఎన్. అప్పారావు, అధ్యాపకులు ఎం. మధుసూదనరావు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు షురూ..

ప్రజాశక్తి -మెరకముడిదాం

మండలంలో సిరిదేవిపురం గ్రామంలో సర్పంచ్ దేవర అప్పలనాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం పారిశుధ్య పనులు చేపట్టారు. కాలువ పూడికతీతలతో పాటు బ్లీచింగ్ చల్లారు. కార్యక్రమంలో కార్యదర్శి కంది రమణ పాల్గొన్నారు. చినబంటుపల్లిలో బోరుబావుల వద్ద క్లోరినేషన్ చేపట్టారు.

పారిశుధ్య పనులు పరిశీలన

విజయనగరం టౌన్ : నగరంలోని అయ్యన్నపేట, కామాక్షి నగర్, ఉడా కాలనీ ఫేస్ 4 ప్రాంతాల్లో వివిధ అభివృద్ధి పనులను, పారిశుధ్య పనులను శుక్రవారం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య పరిశీలించారు. ఉడా కాలనీలో నిర్మించిన పాఠశాల ప్రహరీ గోడను, అయ్యన్నపేటలోని కాలువలను, కామాక్షి నగర్‌లో సిసి రహదారిని పరిశీలించారు. అన్న క్యాంటీన్ సందర్శించి ప్రజలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు.

కొత్తవలస : పారిశుధ్య పనులు పక్కాగా చేపట్టాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి కె.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం తుమ్మికాపల్లి గేట్ ఏరియాలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం చేపట్టారు. శానిటేషన్, దోమల లార్వా ఉండే ప్రదేశాలను పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎస్ ఈశ్వరరావు, పంచాయతీ సెక్రటరీ రాజ్ కుమార్, హెల్త్ అసిస్టెంట్ సత్యారావు, ఎఎన్ఎం గౌరీ, ఆశా వర్కర్ జగదీశ్వరి పాల్గొన్నారు.

పిఎసిఎస్ ఉద్యోగులపై కక్షపూరిత వైఖరి వీడాలి

విజయనగరంకోట : పిఎసిఎస్ ఉద్యోగులపై జిల్లా సహకార అధికారి, డిసిసిబి సిఇఒ కక్షపూరిత వైఖరి విడనాడాలని పిఎసిఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు పి.కామేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక అమర్ భవన్‌లో యూనియన్ జిల్లా అధ్యక్షులు రెడ్డి సత్యారావు అధ్యక్షతన జిల్లా స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేకమంది ఉద్యోగులకు ఏళ్ల తరబడి జీతాలు లేవన్నారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా విధులు నిర్వహిస్తున్న వీరికి డిసిఒ, డిసిసిబి సిఇఒ ఏదో ఒక నెపంతో ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఒత్తిడిని తట్టుకోలేక ఇప్పటికే ఇద్దరు ఉద్యోగులు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. వెంటనే ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రయత్నం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాము నాయుడు, డిప్యూటీ జనరల్ సెక్రటరీ డి.నారాయణరావు, ట్రెజరర్ కెవి సత్యనారాయణ, గిరిబాబు, ఆర్‌విజి నాయుడు పాల్గొన్నారు.

నెట్‌బాల్, యోగా పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-గంట్యాడ

మండలంలోని గంట్యాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్‌జిఎఫ్ జిల్లా స్థాయి నెట్‌బాల్, యోగా పోటీలను శుక్రవారం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు అలమండ ఝాన్సీ పోటీలను ప్రారంభించారు. సుమారు 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. డివిజన్ ఇన్‌ఛార్జి జి.తవిటయ్య, మండల కోఆర్డినేటర్ పివిఎస్ఎన్ రాజు, తదితరులు పాల్గొన్నారు.


యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

శరవేగంగా విద్యుత్ దీపాల పునరుద్ధరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో ఇటీవల కురిసిన వర్షాలకు పాడైన విద్యుత్ వీధి దీపాల ఏర్పాటు వేగంగా జరుగుతుంది. కమిషనర్ ఆదేశాలతో ఇంజనీరింగ్ సిబ్బంది వీధి దీపాలు, విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ఒకటో డివిజన్ హనుమాన్ ధ్యాన మందిర్ ప్రాంతంలో విద్యుత్ స్తంభాలను అమర్చుతున్నారు. అరకాల గడ్డ వీధి, కొత్త అగ్రహారం, కాళీఘాట్ కాలనీ, కె ఎల్ పురం ప్రాంతాలలో విద్యుత్ దీపాలకు మరమ్మతులు చేయిస్తున్నారు. అవసరమైనచోట్ల కొత్త విద్యుత్ లైట్లను అమర్చుతున్నారు.

ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ వీధి దీపాల మారమ్మత్తులను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నామన్నారు. అవసరమైన చోట్ల విద్యుత్ స్తంభాలను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు.

పని గంటల పెంపును వ్యతిరేకించండి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

దేశంలో మోడీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లను, పని గంటల పెంపును కార్మికులంతా వ్యతిరేకించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ అన్నారు. ఎఐటియుసి 106 వ వ్యవస్థాపక దినోత్సవాన్ని శుక్రవారం పిడబ్ల్యు మార్కెట్ లో నిర్వహించారు. బుగత అశోక్ ఆసంఘం జెండా ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం దేశంలోకార్మిక వర్గం నెత్తురు చిందించి ప్రాణ త్యాగాలు చేసి సాధించుకున్న 8 గంటల పని దినాలను పెంచి కార్మిక చట్టాలను తుంగలో తొక్కుతోందని అన్నారు. ఈనేపథ్యంలో ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించేందుకు, కార్మిక చట్టాలను కాపాడుకునేందుకు దేశవ్యాప్తంగా కార్మికులు పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కెల్ల సూర్యనారాయణ, పతివాడ శ్రీను, మజ్జి చిన్న, గనివాడ సురేష్, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బూర వాసు మరియు కార్మికులు పాల్గున్నారు.

సమస్యలు పరిష్కారం కాని సమావేశాలెందుకు?

కౌన్సిలర్ల అసహనం



వాగ్వివాదానికి దిగిన టిడిపి, వైసిపి కౌన్సిలర్లు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

సమస్యలు పరిష్కారం కాని సమావేశాలెందుకని పలువురు కౌన్సిలర్లు అసహనం వ్యక్తం చేశారు. నగర పంచాయతీ అభివృద్ధి విషయంలో టిడిపి, వైసిపి కౌన్సిలర్ల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. శుక్రవారం స్థానిక కార్యాలయంలో చైర్ పర్సన్ బంగారు సరోజిని అధ్యక్షతన నగర పంచాయతీ సమావేశం వాడీవేడిగా సాగింది. కౌన్సిలర్ అవనాపు సత్యనారాయణ మాట్లాడుతూ కౌన్సిల్ సమావేశానికి సమోసా, టీ కోసం వస్తున్నట్లు ఉందే తప్ప, వార్డుల్లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని, పరిష్కారానికి నోచుకోలేదని అసహనం వ్యక్తం చేశారు. రెండు పార్టీల హయాంలో అభివృద్ధి చెందలేదన్నారు. దీంతో వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, వైసిపి కౌన్సిలర్లు నల్లి కృష్ణవేణి, తుమ్ము భారతి జోక్యం చేసుకుని వైసిపి హయాంలో నగర పంచాయతీ అభివృద్ధికి నోచుకోలేదని చెప్పడం అవాస్తమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత ఒక పేదవానికైనా ఇళ్ల పట్టాగాని, ఇంటి నిర్మాణానికి నిధులు మంజూరు చేశారా? అని ప్రశ్నించారు. దీంతో చైర్ పర్సన్ జోక్యం చేసుకుని సమావేశం ముగిసిందని ప్రకటించారు. మొత్తానికి ఎజెండాలోని అంశాలను పూర్తిగా చర్చించకుండానే సమావేశాన్ని ముగించారు. సమావేశంలో కమిషనర్ టి.జయరాం, వైస్ చైర్మన్ కారుకొండ కృష్ణ, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రయివేటీకరణపై సంతకాల సేకరణ

ప్రజాశక్తి- మెరకముడిదాం

మండలంలో చినబంటుపల్లి, సింగవరం, బొడెందొరవలస, లెంకపేట గ్రామాల్లో ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి మండల అధ్యక్షులు కోట్ల విశ్వేశ్వరరావు ఆధ్వర్యాన సంతకాలు సేకరించారు. కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, పప్పల కృష్ణమూర్తి, పల్లి కృష్ణమూర్తి నాయుడు, బెహరా రామలింగేశ్వర రావు, లెంక త్రినాథ, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వేపాడ : వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా మండలంలోని వీలుపర్తిలో వైసిపి ఆధ్వర్యాన సంతకాలు సేకరించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు ఎం.జగ్గుబాబు, మాజీ సర్పంచ్ నాయుడు, జి.శ్రీను, రావాడ వెంకటరావు, వరహాలు పాల్గొన్నారు.

తెర్లాం : వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా మండలంలోని పెరుమాలి, డి.గజబవలస, జగన్నాథవలస, పనుకువలస, లోచర్లలో వైసిపి నాయకులు సంతకాలు సేకరించారు. కార్యక్రమంలో వైసిపి మండల ఉపాధ్యక్షులు చిన్నమనాయుడు, వైస్ ఎంపిపి రమాదేవి, జి.వెంకట్రావు, బి.శేషగిరిరావు, సర్పంచ్ సిహెచ్ సత్యనారాయణ, మాజీ సర్పంచ్ ఆదినారాయణ పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి : సిపిఎం

ప్రజాశక్తి - గజపతినగరం

పురిటిపెంట జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి.శ్రీనివాస్ డిమాండ్‌చేశారు. సిపిఎం నాయకులు దాసరి సింహాద్రితో కలిసి శుక్రవారం జగనన్న కాలనీని ఆయన సందర్శించారు. అక్కడ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. 100కు పైగా ఇళ్లు నిర్మించిన ఈ కాలనీలో ఏ ఒక్కరికీ కంటిమీద కునుకు లేకుండా ఇబ్బందులు పడుతున్నారని శ్రీనివాస్ తెలిపారు. నీళ్ల ట్యాంకు ఉన్న ఇంటింటికీ కొళాయిలు లేవని, కాలువలు, రోడ్లు పూర్తి చేయలేదని చెప్పారు. చెత్తాచెదారం పోయడానికి వేరొక స్థలం కేటాయించలేదదన్నారు. ఇళ్లు మంజూరు చేసినా, మౌలిక సదుపాయాలు కల్పించకపోతే ఎలా జీవిస్తారని ప్రశ్నించారు. తక్షణమే మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.


కాలనీవాసులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

సిఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి కోటలో శుక్రవారం సిఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే బేబినాయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మండలంలోని చింతాడకు చెందిన ఉర్లాపు రవికి రూ.40 వేలు, రామభద్రపురం మండలం తారాపురానికి చెందిన కొంపంగి చరణ్ తేజకు రూ.40 వేలు చెక్కులను అందించారు.

టిడిపిలో చేరికలు

మండలంలోని కోమటిపల్లికి చెందిన 63 కుటుంబాలు వైసిపిని వీడి టిడిపిలో చేరాయి. కోటలో వారికి ఎమ్మెల్యే బేబినాయన టిడిపి కండువాలు వేసి ఆహ్వానించారు.

2న సబ్ జూనియర్ కబడ్డీ జట్లు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నవంబర్ 7 నుండి 9 వరకు కర్నూలు జిల్లాలో జరగబోయే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీలలో పాల్గొనే విజయనగరం జిల్లా కబడ్డీ జట్లు ఎంపిక ఈనెల 2వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు స్థానిక సిటీ క్లబ్ లో జరుగుతుందని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు , రంగారావు దొర, ప్రభావతి, ఆర్గనైజింగ్ కార్యదర్శి లక్ష్మణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికకు వచ్చే క్రీడాకారులు డిసెంబర్ ఒకటి 2009 తరువాత పుట్టిన వారై ఉండాలని, బరువు బాలురు 60 కేజీలు, బాలికలో 55 కేజీల లోపు ఉండాలని తెలిపారు. వివరాలకు.9949721949ను సంప్రదించాలని కోరారు.

దాడిశెట్టి ఔదార్యం

ప్రజాశక్తి-డెంకాడ

మండలంలోని సింగవరం గ్రామంలో మూడు రోజుల నుంచి మోటార్ పనిచేయకపోవడంతో తాగునీటికి గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో జనసేన నాయకుడు దాడిశెట్టి శ్రీనివాసరావు వాటర్ ట్యాంకర్‌తో గ్రామస్తులకు తాగునీరు సరఫరా చేస్తున్నారు కష్టకాలంలో తాగునీరు అందిస్తున్న శ్రీనివాసరావును గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బోని నర్సింగ్, దాడిశెట్టి రమణ, భావన నగేష్, గానుగుల రమేష్ పాల్గొన్నారు.


తాగునీరు సరఫరా చేస్తున్న జనసేన నాయకులు

మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలి

ప్రజాశక్తి-వంగర

మహిళలు అన్ని రంగాల్లో రాణించి ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని డిఆర్‌డిఎ ఎపిడి డి.రత్నాకర్ అన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు అందించే రుణాలు, వార్షిక రుణ ప్రణాళిక, జీవనోపాధులపై సమీక్షించారు. ఎంసిపి పద్ధతిలో నెలాఖరికి రూ.13 కోట్లు యూనిట్లు గ్రౌండింగ్ చేయాల్సి ఉండగా రూ. 9.45 కోట్లు రుణాలు అందించారని వెల్లడించారు. కార్యక్రమంలో డిపిఎంలు ఎ.చిరంజీవి, జె.లక్ష్మీనాయుడు, ఎపిఎం మంగమ్మ ఉన్నారు.

వసతిగృహాల సందర్శన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బక్కునాయుడుపేట వద్దనున్న కెజిబివి, గురుకులం, మోడల్ స్కూల్ వసతిగృహాలను ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ శుక్రవారం సందర్శించారు. గురుకులంలో వార్డెన్ డెప్యుటేషన్‌పై వెళ్లిపోవడంతో మెనూ అమల్లో లోపాలను గుర్తించారు. ప్రిన్సిపల్ జయశ్రీకి సూచనలు చేశారు. కెజిబివిలో డైనింగ్ హాల్ చిన్నది కావడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతుండటాన్ని గుర్తించారు.


ప్రిన్సిపల్ జయశ్రీతో మాట్లాడుతున్న ఎంపిడిఒ

జనవరిలో టైప్ రైటింగ్ పరీక్షలు

విజయనగరం టౌన్ : టైపురైటింగ్ పరీక్షలను జనవరి 24, 25 తేదీలలో నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర టైపురైటింగ్, షార్ట్ హ్యాండ్ ఇనిస్టిట్యూట్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, శ్రీరామ టైప్ ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపాల్ అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. టైప్ నేర్చుకోవడం వల్ల వ్యక్తిత్వ వికాసంతో పాటు ఇంగ్లీష్ పై మంచి పట్టు సాధించవచ్చని తెలిపారు.

కూనాయవలసలో సివిల్ రైట్స్ డే

తెర్లాం : మండలంలోని కూనాయవలసలో ఎస్ఐ సాగర్ బాబు ఆధ్వర్యంలో శుక్రవారం పౌరహక్కుల దినాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌సి, ఎస్‌టి కాలనీల్లో ఉన్న వారికి హక్కుల గురించి అవగాహన కల్పించారు. గ్రామస్తుల సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.విజయబాబు, పంచాయతీ సెక్రెటరీ మధు పాల్గొన్నారు